# పదహారో ప్రాయం

స్టవ్ మీద పాలు పొంగి పోవడానికి సిద్ధంగా ఉన్నాయి. గిన్నెపై మూత కొద్దికొద్దిగా పక్కకు జరుగుతోంది. ఆ మూత కిందపడి శబ్దం చేస్తేనేగాని ఎవరూ అక్కడికి పరుగెత్తుకు రాలేరని ఆ పొంగే పాలకీ తెలుసు తళ్ళతళ్ళమెరిసే ఆ గిన్నెకూ తెలుసు. అవి రెండూ బదులుకొని తగిన సమయం కోసం వేచిచూస్తున్నాయి.

సరిత కూడా తగిన సమయం కోసం వేచి చూస్తూనే ఉంది. కాలం కలిసి రావాలి కదా అని అప్పుడప్పుడు తనే సర్దిచెప్పుకుంటుంది. కాని అంతలోనే తన సమర్థింపును దాటవేస్తుంది. గదిలో పెట్టి బంధిస్తుంది. కాలం కాదు ముఖ్యం కాంక్ష!

వంట గదిలో ఓ మూల టేబుల్ పై ఎక్కి కూర్చొని ఫ్లోరోసెంట్ దీపకాంతిలో తదేకంగా, తమకంగా, ఇష్టపూర్వకంగా చదువుకుంటున్న న[illegible] చటుక్కున మూసి మరోసారి తెరిచి పేజీ నంబరు చూసుకొని దాన్ని మూసి డ్రాయర్‌లో కుక్కేసి గబుక్కున టేబుల్ పైనుంచి దూకింది. వడివడిగా ఆమె కాళ్ళు గ్యాస్‌స్టవ్ చెంతకు చేరి విశ్రమించాయి. పాలని దించి గ్లాసులో పోసేసింది. అరస్పూను చక్కెర దాన్లో వదిలి కలిపింది. వేడివేడి పాలు వెచ్చగా ఆమె గొంతును తడిపాయి. టవల్‌తో మూతి తుడుచుకుంది. ఆమె పాదాలు మరలా మొదటి స్థానానికి చేరుకున్నాయి. నవలా పఠనంలో మునిగిపోయింది. కలా జగత్తులో విహరించసాగింది. ఆ కలల్ని పండించుకునే తగిన సమయం కోసం అందరు ఆడపిల్లల్లాగే సరిత కూడా ఎదురుచూస్తోంది... కాదు... ఆలోచిస్తోంది. ఎలా చెప్పాలి ఈ విషయం? తన తొందరపాటుకు, మిడిసిపాటుకు అందరూ నవ్వుకుంటారేమో? గేలిచేస్తారేమో? గోల మాత్రం చేయరు గదా...?

ఎలాగైనా చెప్పాలి... ఈ రాత్రికే అమ్మతో విషయం చెప్పాలి... నవలని పక్కకి పెట్టి ఆలోచన్లో పడింది. పదవ తరగతి పరీక్షలు మొన్ననే నెల్రకితం ముగిసాయి. ప్రస్తుతం ఖాళీగానే ఉంది సరిత. పదిహేనేళ్ల పసిడి వయసు ఇప్పుడు ఆమె స్వంతం! వయసుకు మించిన తెలివీ చురుకుదనం సరితనే వరించాయి. అన్నీ తెలుసు తనకు, చిన్నప్పటి నుంచీ పత్రికలు చదవటం, రేడియో వినటం, టివీ చూడటం ఇవన్నీ అలవాటే. పుస్తకాలే ఆమెకు గురువు. అవే ఆమెకి సంస్కారాన్ని నేర్పాయి... ఆలోచించడం నేర్పాయి.

* * *

'ఏమిటే ఏదో చెప్పాలన్నావ్ ఏమిటదీ... ఏదైనా ముఖ్యవిషయమా...?' గదిలో రాత్రి పూట అడిగింది కాంతమ్మ కూతుర్ని.

'అవునమ్మా... నాకు శ్రీనివాసంటే చాలా ఇష్టం... ఆ విషయం చెబుదామని...' ఆగింది సరిత.



ఉదయం నవతరం వారపత్రిక

తల్లి ఒక్కసారి కూతురు వేపు తదేకంగా, ఆశ్చర్యంగా చూసింది. ఇంత చిన్న వయసులో ఇదిలా ఆలోచిస్తుందేమిటని బిత్తరపోయింది. కాసేపటికి తేరుకొని నేను నాన్నగారితో మాట్లాడుతాలే అమ్మా అని చెప్పి లైట్ ఆఫ్ చేసి పడుకోడానికి మంచంపై వెనక్కువాలింది కాంతమ్మ.

ఒక శుభముహూర్తంనాడు సరితా శ్రీనివాస్‌ల పెళ్లి దివ్యంగా జరిగింది. అందరూ ఆశీర్వదించి వెళ్లిపోయారు. కొందరు చుట్టాలు అమ్మాయి అదృష్టానికి మెచ్చుకున్నారు. అందమైన కుర్రవాణ్నే పట్టావు లేమ్మా అని ఆనందపడిపోయారు. కాని అసలు మాటకొస్తే సరిత అందానికి సరైనజోడు ఆ మన్మధుడే అని చెప్పాలి. శ్రీనివాస్ కాస్తో కూస్తో ఆ మన్మధుడి అందాల్ని పుణికిపుచ్చుకున్న వాడే మరి!

ఎన్నెన్నో ఆశలతో, గుండెనిండా కోరిక నింపుకొని, తీవ్రమైన తమకంతో, ఆనందంతో... ఆ తెలియని అనుభూతితో అత్తవారింట్లో ప్రవేశించింది సరిత. మొదటిరేయి అనుభవాల కోసం ఎదురు చూడసాగింది. ఆదివారం— శుభదినం— అందరూ ఆనందంగా గడిపే రోజు— అందునా ఆదివారం తన అదృష్టవారం— తేదీ నాలుగు—నెల జూన్.

ఒంటి నిండా ఆభరణాలు పులుముకొని పట్టుచీరతో సెంటువాసనలతో నిండు సౌభాగ్యవతిలా మహాలక్ష్మిలా, హంసలా నడుచుకుంటూ లోనికి ప్రవేశించింది సరిత. గడియపెట్టి బిడియపడుతూ ముందుకు నడిచింది.

పాలగ్లాసందుకొని మెల్లగా అతని చెంతకు చేరింది. అతని పెదవులు ఆనందంతో విస్తరించాయి. మెల్లగా ఆమె చేయందుకొని తన పెదవులతో సంధి కలిపాడు. పాలని ఇద్దరూ పంచుకున్నారు. పక్కని కూడా... కిటికీలోంచి పున్నమి వెన్నెల వారి క్రీడల్ని తిలకిస్తోంది. ఇద్దరి గుండెలూ వేగాన్ని పెంచేశాయి. రాపిడికి వారి మధ్య చెమట మరింత తయారౌతోంది. చిన్న చిన్న మూల్గులు అక్కడి నిశ్శబ్దాని చీకల్చుతున్నాయి. అతను పక్కకు ఒరిగాడు. ఒక్కక్షణం సరిత ఆలోచనల్లో శూన్యం ప్రవేశించింది. ఆవేశం చప్పున చల్లారిపోయింది. ఆమె కళ్లల్లోంచి నీరు రెండు చుక్కలుగా క్రిందకి దుమికి ఆమె గుండెల్ని తడిపాయి. లేచి బాత్‌రూంకెళ్లి తిరిగొచ్చి పడుకుంది. అతను గాఢనిద్రలో ఉన్నాడు. సమయం పదకొండు గంటల ఇరవై నిముషాలు. నిరాశగా, బాధగా, చిత్తయినదానిలా, విరిగిన కట్టెపుల్లలా... భారంగా, మౌనంగా... లైటు ఆపుచేసి తనూ పడుకుంది అసహనంగా, అయిష్టంగా తెల్లవారింది. అతను ఆఫీసుకు వెళ్లిపోయాడు. సరితకు ఏ పనీ చేయబుద్ధి కావడంలేదు. ఈ రోజు వంట చేయకూడదని నిశ్చయించుకుంది. కాని మనసు మార్చుకొని చేసింది. ఎలాగైనా అతన్ని అడగాలనుకుంది. 'అలా ఎదిరించి అడిగితే ఏమన్నా బావుంటుందా...?' మళ్లీ తనే అనుకుంది. రెండో రాత్రి కూడా మొదటి రాత్రినే అనుసరించింది. మూడు నాల్గు ఐదు... నెల.. ఆర్నెళ్లు... సంవత్సరం... సరితకు కోపం తారాస్థాయికి చేరుకుంది. ప్రవర్తనలో మార్పుచేసింది. అతనికి చిరాకు కల్గించేలా నడుచుకుంటోంది. పుట్టింటికి పోతానని గోలచేస్తుంది. కానిపోదు... ఎలా పోతుంది? అక్కడ వారా విషయం అడిగితే తనేం జవాబు చెప్పగల్గుతుంది?

చివరికి నిర్ణయించుకొని తీవ్రంగా ఆలోచించుకొని అతన్ని నిలదీయాలని స్థిరనిశ్చయానికొచ్చింది. ఆరోజు ఆఫీసు నుండి త్వరగా వచ్చాడు శ్రీనివాస్. వస్తూనే మల్లెపూలు వెంటతీసుకొచ్చాడు. పరుగుపరుగున వస్తూ సరితను గట్టిగా వాటేసుకున్నాడు. సరితకు పిచ్చి ఆగ్రహం నషాళానికెక్కింది. ఒక్క ఉదుటున గట్టిగా విదిలించుకుంది. పూలని నేలకేసి కొట్టింది. ఏడుస్తూ వెళ్లి చేతుల్లో ముఖాన్ని దాచుకుంటూ మంచంపై కూలబడింది.

'సరితా! నా మీద కోపమా...?' సౌమ్యంగా అడిగాడు. సరిత మౌనం వహించింది.

'నాకు తెలుసు సరితా... నీ కోపం నా ప్రవర్తన మీద ఔనుకదూ...'

నిజంగా నీకు నేను జోహార్లు అర్పించాలి. నీలాంటి అనువైన భార్య నాకు లభించడం నిజంగా నాకు వరం!

నువ్వు నన్నేం అడగాలనుకుంటున్నావో నాకు తెలుసు. అసలు విషయం నీకు ముందే నేను చెప్పలేకపోవటం నా పొరపాటే. అయినా ఇప్పుడు మునిగిపోయింది లేదు. చెప్తాను విను... చెప్పసాగాడు. చెవులు రిక్కించింది సరిత.

'వయసుకు మించిన కోరికలు నీవి. సాధారణంగా ప్రతి స్త్రీ పదహారేళ్లు దాటాకే సంసారంపై ఆసక్తిని పెంచుకుంటుంది. కాని నీ విషయం అలా కాదు. నీ విషయంలో తొందరపాటు ఎక్కువ. మొదటి రాత్రే నేను నీలో పూర్తి తమకాన్ని గ్రహించాను. కాసేపు నేనూ విస్తుపోయాననుకో... కానీ నేను కొన్ని పద్ధతులున్న వ్యక్తిని. విచక్షణారహితంగా ప్రవర్తించడం నాకు గిట్టదు. నా వయసు ఇరవై మూడు. నేను శారీరకంగా బాగా ఎదిగిన వాడిని. కానీ నువ్వలాకాదు. నువ్వింకా ఎదగాలి. ఇంత చిన్న వయసులో నేను నీకు తల్లిభారాన్ని అంటకట్టలేను. అలా చేస్తే అది నీ ఎదుగుదలకు పూర్తి ఆటంకాన్ని కల్గిస్తుంది. అందుకే నీవు పరిపుష్టిగా ఎదిగేవరకూ నేను ఆగాల్సి వచ్చింది. అందుక్కారణం నాలో లోపమూ కాదు. అశక్తత అంతకన్నా కాదు. నేటితో నీకు పద్దెనిమిది ప్రవేశించుతాయి. అందుకే నేటి రోజే మనకు సుదినం...

శోభనం కూడా... అంటూ ఆమె కన్నీళ్లు తుడిచి భుజం తట్టాడు శ్రీనివాస్.

సరిత తన తొందరపాటుకు సిగ్గుతెచ్చుకొని తల పంకించింది. మెల్లగా తన్మయత్వంతో అతని ఒడిలో వాలిపోయింది. ఆమె గుండెల్లో మరోసారి తమకం తలుపులు తెరచింది.

ఆ రోజు రాత్రి వారిద్దరికీ పూర్తిగా అమ్ముడుపోయింది. ●



భోగ శ్రీనివాసమూర్తి